### శాకంబరీ దేవిగా అమ్మవారు

సదాశివపేట, ఫిబ్రవరి 9: హట్కరిపేట కాలనీలోని రామలింగ చౌడేశ్వరి ఆలయం 26వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

రిటైర్డ్ ఉపాధ్యాయులకు

## సన్మానం

జిన్నారం ఫిబ్రవరి 9: పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిన్నారం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్‌చెరు ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, శశిధర్‌లను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులుగా వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పవన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ ఋషి, సభ్యులు త్రిశూల్ నాథ్, చంద్రమౌళి, రవికుమార్, రామకృష్ణారెడ్డి, అనిల్ కుమార్ ఉన్నారు.

### ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

జహీరాబాద్, ఫిబ్రవరి 9: జహీరాబాద్ పట్టణంలోని ఎంఆర్సీ కార్యాలయంలో పీఆర్టీయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్, నాయకులు శ్రీనివాస్, నర్సయ్య, శివరాజ్, శ్రీశైలం, తుకారం, అనంద్, మురళీధర్, తిరుమలేశ్, నాగయ్యస్వామి పాల్గొన్నారు.

స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

### వైభవంగా స్వామివారి కల్యాణం

జిన్నారం, ఫిబ్రవరి 9: మండలంలోని బొల్లారం మున్సిపాలిటీలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు చంద్రారెడ్డి మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మాధవరెడ్డి, హనుమంత్‌రెడ్డి, రాజేందర్రెడ్డి, యాదిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మనూరు, ఫిబ్రవరి 9: మనూరు మండల పరిధిలోని బోరంచ గ్రామంలో మంజీరా ఒడ్డున ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు శ్రీకాంత్ స్వామి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

### 17 నుంచి ఉర్సు ఉత్సవాలు

హత్నూర, ఫిబ్రవరి 9: హత్నూర మండలం కాసాల శివారులోని హజ్రత్ సయ్యద్ ఆబేద్ హుస్సేన్ చిస్తీ రహ్మతుల్లా అలై ఉర్సు ఉత్సవాలు ఈనెల 17 నుంచి ఘనంగా ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 17న సందల్ ముబారక్(గంధం)ఊరేగింపు, 18న చిరాగా(దీపారాధన), 19న ఖత్మాఖురాన్ జియారత్ ఫాతిహా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తామని చెప్పారు.

# ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

- ఇప్పటికే పూర్తయిన బ్యాలెట్ పేపర్ల ముద్రణ
- మండలాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వానున్న అధికారులు

న్యాల్‌కల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

జహీరాబాద్ ఎంపీడీవో ఆఫీస్‌కు చేరుకున్న సామగ్రి

జహీరాబాద్, ఫిబ్రవరి 9: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోయినప్పటికీ ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు. గ్రామ పంచాయతీల పాలన గతేడాది జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలైతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతిల్లోకి వెళ్లింది. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సిద్ధం కావడంతో కీలక ఆదేశాలను జారీ చేసింది. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల పరిధిలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతోపాటు పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఇప్పటికే ఆయా మండల అధికారులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆయా ఎన్నికల సంబంధించి పోటీలో నిలిచే అభ్యర్థులకు ఏయే గుర్తులు ఇవ్వాలనేది ఎన్నికల సంఘం ఉత్తర్వులను జారీ చేయడంతో వాటి ప్రకారం బ్యాలెట్ పేపర్ల ముద్రణ సైతం పూర్తి చేశారు. బ్యాలెట్ పేపర్ల నంబర్లు, గుర్తులు సరిగ్గా ఉన్నాయా.. లేదని మండల అధికారులు పరిశీలిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలకు గులాబీ, వార్డు సభ్యుడికి తెలుపు బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్పంచుకు 20, వార్డు సభ్యుడికి 10 గుర్తులను కేటాయించారు. బ్యాలెట్ పేపర్లను పరిశీలన పూర్తయిన తర్వాత గోదాంలో భద్రపర్చనున్నట్లు సంబంధిత మండల అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రికి కూడా చేరుకుంది. మరో వైపు ఎన్నికలకు నిర్వహణకు సంబంధిత పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సంబంధిత జిల్లా అధికారులు ఏర్పాట్లను సైతం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వివరాలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తికావడంతో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బందికి ఈనెల 14వ తేదీ నంచి వరసగా శిక్షణను ఇచ్చేందుకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రధాన పార్టీలు సైతం దృష్టి సారించడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిగల ఆయా మండలాలకు చెందిన నాయకులు అధిష్ఠానం అశీస్సులు, టికెట్లను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పచి నుంచే గ్రామాల్లో హడావిడి చేస్తున్నారు.

గుమ్మడిదల: బొంతపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు గౌరీశంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## గౌరీశంకర్ మృతి పార్టీకి తీరని లోటు

**ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

గుమ్మడిదల, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొంతపల్లి గౌరీశంకర్ గౌడ్ లేని లోటు బీఆర్ఎస్‌కు తీరని లోటని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లిలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి బొంతపల్లిలో ఆయన స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా తండ్రి కిష్టాగౌడ్, తల్లి భారతమ్మ, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోవద్దన్నారు. బీఆర్ఎస్‌లో, ఉద్యమకాలంలో కీలకనేతగా వ్యవహరించిన నాయకుడని కొనియాడరు. వీరితోపాటు బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వేణు, వీరయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తేతెలంగాణ): పటాన్‌చెరులో పట్టుబడిన 220కిలోల గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు పాత నేరస్తులను పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు మహారాష్ట్రలో అరెస్టు చేసి, నగరానికి తీసుకువచ్చారు. పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో పరమేశ్వర్ గౌడ్ కథనం ప్రకారం...మహారాష్ట్రకు చెందిన చంద్రకాంత్ నారాయణ, అమర్ సంజయ్ కావాల్, దిలీప్ అగాడా కలిసి ఒడిశా ఏవోబీ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, పలు ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఈ క్రమంలో ఒడిశా-ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల నుంచి డీసీఎంలో 220కేజీల గంజాయిని హైదరాబాద్, పటాన్‌చెరు మీదుగా మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వో పరమేశ్వర్ గౌడ్ తన బృందంతో కలిసి గతేడాది మార్చి 1న ముత్తంగి టోల్‌ప్లాజా వద్ద నిందితుల వాహనాన్ని పట్టుకున్నారు. అధికారుల రాకను గమనించిన ప్రధాన నిందితుడు దిలీప్ అగాడా, అతడి బావమరిది అమర్ సంజయ్ కావాల్ పరారయ్యారు. వ్యాన్ డ్రైవర్ చంద్రకాంత్ నారాయణను అరెస్టు చేసి, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చేపట్టారు. ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసుల బృందం మహారాష్ట్రలోని సతాజర్ జిల్లాకు వెళ్లి పరారీలో ఉన్న దిలీప్ అగాడా, అమర్ సంజయ్ కావాల్‌ను అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై ఆదివారం నగరానికి తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయిని రూపుమాపే క్రమంలో నిందితులనువదలబోమన్నారు. పోలీసులను ఈడీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చందర్ అభినందించారు.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

సిర్గాపూర్, ఫిబ్రవరి 9: సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా, సిర్గాపూర్ మండల కేంద్రంలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మండలంలోని జమ్లా తండా మాజీ సర్పంచ్ దివ్యభారతీచరణ్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ టోర్నీని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఇరు జట్ల క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆక్షాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు విఠల్, గణేశ్, మల్లికార్జున్, నాయకులు నర్సాగౌడ్, పరుశురాం, తుకారం, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

సిర్గాపూర్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో నాగారం శ్రీనివాస్

## పేకాట స్థావరంపై దాడి: 16 మంది అరెస్టు

- భారీగా పట్టుబడిన నగదు..వాహనాలు స్వాధీనం
- నిర్వహకుడి కోసం గాలిస్తున్న పోలీసులు

వట్‌పల్లి, ఫిబ్రవరి 9:పేకాట స్థావరంపై దాడి చేసి 16మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు వట్‌పల్లి ఎస్సై విఠల్ తెలిపారు. మండల పరిధిలోని మర్వెల్లి శివారులో పేకాట ఆడుతున్నారని శనివారం రాత్రి సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరాలపై దాడులు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 16మంది వ్యక్తులతో పాటు వారి వద్దనున్న రూ.3.85 లక్షల విలువైన కాయిన్స్, రూ.22,875 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారు ఉపయోగించిన జెల్లో వాహనం, ఒక బైక్, 15 మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట శిబిరం నిర్వహించిన వ్యక్తుల కోసం గాలిస్తున్నామని వారిని పట్టుకొని విచారిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు.

## రామకృష్ణకు జాతీయ నంది పురస్కారం

జాతీయ నంది పురస్కారం అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ

సదాశివపేట, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని నిజాంపూర్(కే) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణకు జాతీయ నంది పురస్కారం వరించింది. ఆదివారం తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభ చిక్కడపల్లిలో జాతీయ బంగారు నంది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. జాతీయ తెలుగు కళా రత్నాల సీఈవో డాక్టర్ యూవీ రత్నం, జాతీయ కన్వీనర్ ధనాసి ఉషారాణి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జగదీశ్వర్, పాడుతాతీయగా ఫేమ్ రాజాబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ..అత్యుత్తమ విద్య, సామాజిక సేవలకు జాతీయ నంది పురస్కారం అందించారని, తనను అవార్డుకు ఎంపిక చేసిన కమిటీకి కార్యనిర్వాహకులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

## వాటర్ ట్యాంక్ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం

కంది మండలం బేగంపేటలో వాటర్ ట్యాంక్ స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

కంది, ఫిబ్రవరి 9: కంది మండలం బేగంపేట గ్రామకంఠం భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు చేసిన ఆదేశాలను మండల అధికారులు పట్టించుకోవడం లేదు. కబ్జా చేసిన వాటర్ ట్యాంక్ స్థలంలో గుంతలు తవ్వి నిర్మాణ పనులు కొనసాగుతున్నా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారని, వాటర్ ట్యాంక్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని బేగంపేట గ్రామస్తులు కోరుతున్నారు. కబ్జాపై ఈనెల 3న సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఆక్రమణదారులు దర్జాగా జేసీపీతో గుంతలు తవ్వే పనులను ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి, మండల అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఉద్యమిస్తామన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద ఆదివారం పోలీసులు 23టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి కేఏ 32 ఏఏ 2846 లారీలో రేషన్ బియ్యాన్ని కర్ణాటకు తరలిస్తున్న క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌వోటీ, కొల్లూర్ పోలీసులు సంయుక్తంగా టోల్ ప్లాజా వద్ద లారీని పట్టుకొని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ రాజుచౌహాన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎస్సై దేవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9: నారాయణఖేడ్ మండల పరిధిలోని సత్యగామ గ్రామానికి చెందిన పుష్పల రామయ్య భార్య అనారోగ్యంతో చికిత్స పొందడంతో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 27వేల చెక్కును లబ్ధిదారుడికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశం, రాజిరెడ్డి, సాయిరెడ్డి, చాకలి అంజయ్య, మల్లయ్య, గైని నాగయ్య, అంపయ్య, గైని రాజు తదితరులు ఉన్నారు.

## ఉంగరం లాక్కెల్లిన దుండగులు

హత్నూర, ఫిబ్రవరి 9: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని తెలిసిన వ్యక్తులుగా పలకరించి ఆపై అతడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని దొంగిలించిన ఘటన హత్నూర మండలం మంగాపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..కాసాల గ్రామానికి చెందిన కటికె భిక్షపతి ద్విచక్ర వాహనంపై నర్సాపూర్ వెళ్తున్నాడు. నర్సాపూర్ నుంచి ఎదురుగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తూ మంగాపూర్ శివారులోకి చేరుకోగానే భిక్షపతిని తెలిసిన వ్యక్తులుగా పలకరించడంతో భిక్షపతి ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై నిలిపాడు. వెంటనే ఇద్దరు వ్యక్తుల్లో ఓ వ్యక్తి అతడిని పట్టుకోగా మరో వ్యక్తి అతడి చేతికిఉన్న తులం బంగారం ఉంగరాన్ని లాక్కొని పారిపోయారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దౌల్తాబాద్‌లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

సిర్గాపూర్: ఓపెన్ తరగతులు ప్రారంభించి సూచనలిస్తున్న కోఆర్డినేటర్

## సిర్గాపూర్‌లో ఓపెన్ తరగతులు ప్రారంభం

సిర్గాపూర్, ఫిబ్రవరి 9: సిర్గాపూర్‌లోని హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులను ఎంఈవో, స్థానిక ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగారం శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడి మానేసి, ఇంటి వద్ద ఉన్న వారికి నేరుగా టెన్త్, ఇంటర్‌లో చేర్పించి, రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే చదువును పూర్తి చేసుకునేందుకు మంచి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యాసకులకు రెగ్యులర్ విద్యార్థులతోపాటుగా ప్రాధాన్యత ఉంటుందని, అన్ని పోటీ పరీక్షలకు అర్హులని చెప్పారు. తత్కాల్ స్కీమ్‌లో రిజిస్ట్రేషన్‌కు, పరీక్షా రుసుము కోసం అవకాశం ఉన్నందున అభ్యాసకులు సద్వినియోగం చేసుకొని ఓపెన్ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. సహాయ కోఆర్డినేటర్ మారుతి, శివకుమార్ ఉన్నారు.

భెల్ కమ్యూనిటీ సెంటర్‌లో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నేషనల్ సేఫ్టీ కౌన్సిలర్ చైర్మన్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్‌రావు అన్నారు. ఆదివారం భెల్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో పర్యావరణ పరిరక్షణ, గృహిణుల భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి రాజగోపాల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేటి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. విద్యార్థులు చదువులోపాటు అన్నిరంగాల్లో బాగా రాణించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. చిత్రలేఖనం, పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మార్చి 4వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతుల ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జాతీయ భద్రత కౌన్సిల్ కోశాధికారి సత్యబాబు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్లు గౌరీశంకర్, ప్రవీణ్‌కుమార్, భెల్ జీఎంహెచ్ఆర్ శ్రీనివాస్‌రావు, జీఎం అరవింద్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

## ఓడీఎఫ్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కంది, ఫిబ్రవరి 9: కంది మండల పరిధిలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2004-2005 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులందరూ 20 ఏండ్ల తర్వాత కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదగా గడిపారు. నాటి గురువులు నేర్పిన క్రమశిక్షణ, విద్యతో వివిధ స్థాయిలో ఉన్నామని తెలియజేశారు. గురువులు వసంత, అనిత, ఆనంద్‌రావులను ఘనంగా సత్కరించారు.

వీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

హత్నూర, ఫిబ్రవరి 9: హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 1982-83 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం జరుపుకొన్నారు. మల్కాపూర్ శివారులోని వీఎస్ఆర్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థులంతా ఒక్కచోటచేరి వారి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.